సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 11 । నవంబర్ । 2024



కమీషన్ ఇస్తేనే పర్మిషన్

మడపాం వద్ద ఇసుక దందా కొనసాగుతోంది. కమీషన్ ఇస్తేనే తవ్వుకునేందుకు పర్మిషన్ ఇస్తున్నారు. - 8లో



నావికోత్సవానికి ఏర్పాట్లు

అరసవల్లిలో హంస నావికోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 13న వేడుక జరగనుంది. - 8లో

బైక్ చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో ఈనెల 5వ తేదీన కొంచాడ సూర్యనారాయణకు చెందిన ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఆదివారం ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం పట్టణం చెందిన బొమ్మలాట మోహన్, ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన మరో ఇద్దరు మైనర్లు ఈ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వీరిని లోలుగు జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్‌రీల్

ఉమారుద్రునికి పుష్పాలంకరణ



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పురాతన ఉమారుద్ర కోటీశ్వర దేవాలయంలో రెండో సోమవారం సందర్భంగా ఆదివారం స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ఈఓ సర్వేశ్వరరావు, అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తిల ఆధ్వర్యంలో పార్వతీదేవిని కూడా పుష్పాలతో అలంకరించారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో కలెక్టర్



కలెక్టర్ కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుడిని ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వారాహి అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. అర్చకులు ఆలయ విశేషాలతోపాటు గోలెం కథ, స్వామి చరిత్ర వివరించారు. అనంతరం శేషవస్త్రాలు అందించి పుణ్యాహవచనాలతో దీవించారు.

బలమైన వామపక్ష వేదిక ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి తులసీదాస్

కాశీబుగ్గ: అటు దేశంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కార్పొరేట్ శక్తులకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బలమైన వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషిచేయాలని పెద్దలు ముక్తకంఠంగా వెల్లడించారు. సీపీఎం జిల్లా 18వ మహాసభల్లో రెండో రోజు ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి తులసీదాస్ తొలి ప్రసంగం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రాణం పోసిన పలాస నేలపై సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించడం ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించడంలో సీపీఎం చురుకైన పాత్ర పోషించిందని, జిల్లాలో వామపక్ష ఐక్య ఉద్యమానికి ఇక్కడి నుండే శ్రీకారం చుట్టాలని అన్నారు. వామపక్ష పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ భారతదేశం జనాభాలోను పేదరికంలోనూ అగ్రస్థానంలోకి వెళ్తున్నదని, ఇది భారతదేశ పరిస్థితిని హెచ్చరిస్తోందని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులకు రాష్ట్ర సీపీఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తులసిదాస్, జిల్లా కార్యదర్శి దుప్పల గోవిదం నివాళులర్పించారు. మహాసభల్లో ప్రజా కళాకారులు ఆటపాటలు, డప్పు వాయిద్యాలు మహాసభల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయి.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఇద్దరు ఎంపిక



టి.విజయ్



ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక సయ్యద్ ముస్తాక్ ఆలీ ట్రోఫీ క్రికెట్ టోర్నీకి జిల్లా నుంచి ఇద్దరు క్రికెటర్లకు ఛాన్స్ లభించింది. 2024–25 సీజన్‌కుగాను ఆంధ్రా జట్టుకు జిల్లా నుంచి త్రిపురాన విజయ్, సింగుపురం దుర్గనాగ వర(ఎస్‌డీఎన్‌వీ)ప్రసాద్ ఎంపికయ్యారు. 16 మంది సభ్యులతో కూడిన తుది జాబితాలో వీరిద్దరు చోటు దక్కించుకోగా.. నాల్గో స్టాండ్‌బైగా సీనియర్ ఆటగాడు ఎస్‌హెచ్ శ్రీనివాస్‌ను ఎంపికచేశారు.

కొత్త పింఛన్లకు గ్రహణ కాలం



నాడు అలా..

వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో అర్హత ఉంటే చాలు వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని, ఆ వలంటీరే స్వయంగా సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసేవారు. పరిశీలనలు సకాలంలో పూర్తి చేసుకుని పింఛన్ మంజూరు చేయడం, ఇంటికే నేరుగా వెళ్లి పింఛన్ అందించడం జరిగేది. ఎవరినీ అడగకుండా, ఎలాంటి వ్యయ ప్రయాసలకు గురి కాకుండా అర్హులు పింఛన్లు అందుకునేవారు.

నేడు ఇలా..

కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే వీలు లేకుండా ఆన్‌లైన్ ఆప్షన్‌ను తీసేశారు. పింఛన్ కావాలంటే అర్హత కలిగిన వారు కూటమి నాయకుల వద్దకో, ప్రభుత్వ కార్యాలయాల వద్దకో వెళ్లక తప్పదు. ఒకవేళ దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేయాలో తెలీదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా కొత్త లబ్ధిదారుల జాబితాలు లేనేలేవు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న నాయకులు.. ఆ మాటనే మర్చిపోయారు.

- పెండింగ్‌లో 20వేలకు పైగా దరఖాస్తులు
- కొత్త దరఖాస్తులు అప్‌లోడ్ కాకుడా ఆన్‌లైన్ ఆప్షన్ తీసివేత
- 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి
- అర్హత ఉన్నా పింఛన్ రాక నష్టపోతున్న వృద్ధులు, వితంతువులు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లకు చంద్రగ్రహణం పట్టుకుంది. నెలలు గడుస్తున్న కొద్దీ పింఛన్ లబ్ధిదారుల జాబితాలో సంఖ్య తగ్గుతోందే గానీ.. కొత్తవి మంజూరు కావడం లేదు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ల హామీ నెరవేరనేలేదు. గత ప్రభుత్వంలో ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేసే వారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పనులు సక్రమంగా జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు.

హామీల అమలు ఎప్పుడు?

50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్లు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల సభలోనూ కూటమి నేతలు పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించారు. జిల్లాలో 50 నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రెండున్నర లక్షల మంది వరకు ఉండగా వారిలో 60 శాతం మంది అర్హులు ఉంటారని అంచనాలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయినా కొత్త పింఛన్ల కోసం ఎలాంటి చర్యలు లేవు. ఈ పింఛన్ల మాట కూడా మాట్లాడడం లేదు.

అక్కర్లేని హడావుడి

కొత్త పథకాలు ప్రవేశ పెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఒక్క కొత్త పింఛను కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. గతంలో వచ్చిన పింఛను లబ్ధిదారులకు అందజేయడంలో మాత్రం ఎక్కడలేని హడావుడి చేస్తున్నారు. గతంలో మంజూరైన పింఛన్లు కూడా తామే మంజూరు చేసినట్లు ఫొటోలకు ఫోజులు ఇచ్చి చోటా నాయకులు హల్‌చల్ చేస్తున్నారు.

కొత్త పింఛన్లు ఏవీ..?



ఈ ఏడాది జనవరిలో జిల్లాలో కొత్త పింఛన్లను నాటి ప్రభుత్వం మంజూరు చేసింది. తర్వాత మళ్లీ జూన్‌లో కొత్తవారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం పింఛన్ దరఖాస్తు చేసే ఆప్షన్‌ను మూసి వేయడంతో కొత్త పింఛన్లు రావడం లేదు. మండల జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో పింఛన్ సాయం కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారంతా అధికారుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్నా.. వినేవారు లేరు.

గత ఐదు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 25 వేలకు పైగా పింఛన్ల కోసం దరఖాస్తులు వచ్చినట్లు మీ కోసం రికార్డులు చెబుతున్నాయి. దీనికి తోడుగా కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం 50 దాటిన వారికీ అర్హత ఉంది. అంటే సుమారుగా 2,22,000 మందికి కొత్త పింఛన్లు అందజేయాల్సి ఉంది. కానీ ఈ అంశంపై ఎవరూ నోరు విప్పడం లేదు.

పాత వాటికి కోత..



కొత్త పింఛన్లకు అవకాశమే లేకుండా జాగ్రత్త పడిన ప్రభుత్వం.. పాత వాటికి కూడా కోత పెడుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 3,24,316 ఉండేవి. అవి నవంబర్ నెల నాటికి 3,15,630కి చేరాయి. మొత్తం 8,686 పింఛన్లు తగ్గాయి. కొత్త పింఛను ఒక్కటీ ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. దీంతో లబ్ధిదారులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాపర్ దొంగలు దొరికారు

- వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ గ్యాంగ్ పట్టివేత
- అందరూ ఎచ్చెర్ల మండల వాసులే
- 33 నేరాల్లో 53 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన గ్యాంగు

శ్రీకాకుళం క్రైమ్ : పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లే వారికి టార్గెట్. ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే కాపర్, అల్యూమినియం విలువైనవని తెలుసుకుని గత మూడేళ్లుగా 33 నేరాలు చేసి 53 ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించారు. ఎట్టకేలకు జిల్లా పోలీసులకు ఆ గ్యాంగ్ పట్టుబడింది. వారి నుంచి రూ.1.53 కోట్ల విలువ గల కాపర్ (636 కిలోలు) అల్యూమినియం 5 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. దొరికిన వారంతా ఎచ్చెర్ల మండలానికి చెందినవారు కాగా అధికంగా యువకులే ఉండడం విశేషం. ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న రణస్థలం మండలం మహంతిపాలెం గ్రామవాసి కెల్ల వెంకటరమణ వ్యవసాయ పొలంలో ఉన్న 3–ఫేజ్ 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న సుమారు 12 కిలోల రాగివైరును దొంగిలించడంతో రమణ ఫిర్యాదు చేశారు. జేఆర్ పురం సీఐ ఎం.అవతారం నేతృత్వంలోని ఓ ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టింది. దొంగలు దొరికాక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

చెడు వ్యసనాలకు లోనైన వారే..

ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామానికి చెందిన కుప్పిలి వరప్రసాద్ (23) స్వతహాగా ఎలక్ట్రీషియన్. చెడు వ్యసనాలకు బానిసై జల్సాలకు అలవాటు పడిన వరప్రసాద్ అదే గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న బోర సాయి (19)తో కలిసి పథక రచన చేశాడు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్‌కు మంచి డిమాండ్ ఉందని తెలుసుకుని వాటిని చోరీ చేసేందుకు మూడేళ్ల కిందటే పన్నాగం పన్నారు. వీరికి ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎస్ఆర్ పురానికి చెందిన బలగ రామకృష్ణ (35), బలగ శివ (30), బయ్యన్నపేట గ్రామానికి చెందిన బుడుమూరు గోవింద్, అజ్జరాం గ్రామానికి చెందిన సడి సత్యం (20)లు జతకలిశారు. వీరికి విశాఖపట్నంలోని ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్న సాయి మేనమామ దువ్వ అసిరినాయుడు (30) సహకరించాడు.

దొంగిలించిన సొత్తును..

ప్లాన్ ప్రకారం అవసరాన్ని బట్టి వాళ్లలో వ్యక్తులను ఒక్కో చోరీలో ఒక్కొక్కళ్లను ఉపయోగించుకుని గత మూడేళ్లుగా దొంగిలించిన సొత్తును విశాఖలో ఉన్న అసిరినాయుడుకు అప్పజెప్పేవారు. అతను పనిచేస్తున్న షాపులోనే యజమానిగా ఉన్న కృష్ణారెడ్డికి (ఈయన స్వగ్రామం కూడా అజ్జరాం) అమ్మేసి డబ్బులు చేసుకునేవారు. వీరితో అప్పుడప్పుడు ఎచ్చెర్ల మండలం కుప్పిలి, అజ్జరం గ్రామాలకు చెందిన ఇద్దరు బాలురు కూడా చోరీలకు వెళ్లేవారు.

ఎలా పట్టుబడ్డారంటే..

జిల్లాలోని జె.ఆర్.పురం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, పొందూరు పీఎస్‌ల పరిధిలోని గ్రామాల్లో సుమారు 53 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసి అందులో ఉన్న 636 కిలోల (350 కిలోలరాగివైరు, 286కిలోల రాగి దిమ్మలు) కాపర్, 5 కిలోల అల్యూమినియం వైర్లను దొంగిలించారు. ఆదివారం రణస్థలం మండలం బీరు ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న పాడుబడిన భవనం వెనుక నిందితులు ఉన్న విషయం తెలుసుకున్న సీఐ అవతారం తమ సిబ్బందితో కలిసి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, బాలురు ఇద్దరిని జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. అంతేకాక జిల్లాలో ఇంకా ఇటువంటి ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన మరో రెండు గ్యాంగులను, చైన్‌స్నాచింగ్ చేస్తున్న మరో గ్యాంగును కూడా గుర్తించామని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ అన్నారు.

ప్రతిభకు ప్రశంసలు..

కేసును చాకచక్యంగా ఛేదించడంలో కృషిచేసిన డీఎస్పీ సిహెచ్ వివేకానంద, సీఐ ఎం.అవతారం, ఎస్ఐలు ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణరావు, వై.మధుసూదనరావు, కె.కిరణ్‌కుమార్‌సింగ్, హెచ్‌సీలు కె.లక్ష్మణరావు, ఎం.జోగారావు, డి.తవిటినాయుడు, కె.సూర్యారావు, సీహెచ్ సురేష్‌లను ఎస్పీ అభినందించారు.

బోధనమున పురస్కారం

జిల్లాకు చెందిన ముగ్గురు గురువులు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. బోధనలో వినూత్న పద్ధతులు పాటించడం, ఉత్తీర్ణతలో మెరుగైన ఫలితాలు చూపించడంతో వీరికి అవార్డు వచ్చి వరించింది.

మెరుగైన ఫలితాలతో..



బొడ్డేపల్లి శ్రీనివాసరావు

బూర్జ: ఓవీ పేట ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చింది. ఈయన 13 జూన్ 2013 నుంచి ఎచ్చెర్ల మండలం, కుప్పిలి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. అనంతరం బూర్జ మండలం, ఓవీ పేట ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా13 మే 2022 నుంచి పనిచేస్తున్నారు. 2018న ఈయన జిల్లాస్థాయి అవార్డు కూడా అందుకున్నారు. రాష్ట్రంలోని 164 ఏపీ మోడల్‌స్కూళ్లలో తనకు ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు రావడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈయన కృషితో పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి.

వినూత్న బోధన..



శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని గోవిందపురం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గుంటముక్కల శ్రీనివాసరావుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఈయన స్వగ్రామం గార మండలంలోని అంపోలు. 2000లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఈయన తొమ్మిదేళ్లు కోటబొమ్మాళిలో, ఏడున్నరేళ్లు ఎచ్చెర్ల మండలంలోని వెంకటాపురం గ్రామంలో, ఎనిమిదేళ్లు పొందూరు మండలం లైదాం గ్రామాల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి ఏడాది నుంచి లావేరు మండలం గోవిందపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును పొందారు. తరగతి బోధనతో పాటు వెనుకబడిన విద్యార్థులకు లోకాస్ట్ వస్తువులతో యాక్టివిటీస్ ద్వారా విద్యాబోధన చేస్తుంటారు. అంతేకాకుండా ఇతను స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా ఉన్నారు. టీచర్లకు బోధన పరమైన శిక్షణలను ఇస్తుంటారు. ఈ అవార్డు రావటంతో ఎంఈఓ మురళీకృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఈయనను అభినందించారు.

60కి 60 గ్యారెంటీ



అప్పన్న

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ అధ్యాపకునిగా పనిచేస్తున్న ఆరంగి అప్పన్నకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకునిగా అవార్డు వచ్చింది. ఈమేరకు ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. అప్పన్న స్వగ్రామం సంతబొమ్మాళి మండలం బోరుబద్ర. 16 ఏళ్లుగా ఆయన లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. గడిచిన పదేళ్లుగా వృక్ష శాస్త్రంలో ఈయన విద్యార్థులు చక్కటి ఉత్తీర్ణత సాధిస్తున్నారు. కనీసం సగం మంది ఏటా 60కు 60 మార్కులు తెచ్చుకుంటారని ఆయన తెలిపారు.

తప్పుడు పోస్టులు పెడితే అరెస్టులే

శ్రీకాకుళం క్రైమ్ : సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ వ్యక్తిని లేదా పార్టీని లేదా మహిళలను, వర్గాలను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కించపరిచేటట్లు పోస్టు చేస్తే చట్టపరంగా న్యాయస్థానాలను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో ఏ ఒక్కరినీ, ఏ పార్టీని ఉపేక్షించేది లేదని ఎస్పీ అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛలో భాగంగా తప్పుడు పోస్టులు గతంలో పెట్టి ఉన్నా ఫిర్యాదులు చేస్తే వాటి తీవ్రతను బట్టి విచారణలో నిజా నిజాలు నిర్ధారించుకుని కేసుల నమోదు చేసి 41ఏ నోటీసు ఇవ్వడం గానీ, అరెస్టులు చేసి రిమాండ్‌కు పంపిస్తామని తెలిపారు. ముఖ్యంగా మహిళల ఫొటోలు మార్ఫింగ్ చేయడం, కుటుంబాలను లక్ష్యం చేసుకుని పోస్టులు చేస్తే సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి ఇప్పటికే 12 కేసులు నమోదు చేశామన్నారు.



తీరంలో సందడి..

కార్తీక మాస ఆదివారం కావడంతో భావనపాడు తీరంలో పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా నుంచి వచ్చిన పర్యాటకులతో తీరం కళకళలాడింది. సమీపంలో ఉన్న తోటల్లో మధ్యాహ్నం వనభోజనాలు చేసి సాయంత్రం సముద్రంలో కేరింతలు కొట్టారు. – సంతబొమ్మాళి

పంచారామాలకు బయల్దేరిన ప్రత్యేక బస్సులు



పంచారామాలకు బయల్దేరిన బస్సుకు జెండా ఊపుతున్న డీఎంలు అమరసింహుడు, కెఆర్‌ఎస్ శర్మలు

శ్రీకాకుళం అర్బన్: పంచారామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కెఆర్‌ఎస్ శర్మలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పంచారామాల ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయని తెలిపారు. ఈ సర్వీసులో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో గల శివాలయాల దర్శనానికి వెళ్తారని చెప్పారు. ఈ నెల 17, 24 తేదీల్లో కూడా పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. 10వ తేదీ ఆదివారం జిల్లా నుంచి పంచారామాలకు మూడు బస్సులు బయలుదేరినట్లు తెలిపారు. 'ఒక్క ఫోన్ కాల్‌తో మీ వద్దకు ఆర్టీసీ బస్సు' అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 25608, 9959225609, 9959225610, 99592 25611 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి అసిస్టెంట్ మేనేజర్ పీఎస్‌ఎన్ మూర్తి, ఓపీఆర్‌ఎస్ సూపర్‌వైజర్ ఎండిఎ బాషా, ప్రసాద్, ఎంపీ రావు తదితరులు ఉన్నారు.

ఆద్యంతం అలరించేలా..

- శ్రీకాకుళంలో లాంఛనంగా ప్రారంభమైన 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు
- బాస్కెట్‌బాల్, మోడర్న్ పెంటాథ్లెన్ క్రీడాంశాల్లో తుది దశకు చేరుకున్న పోరు
- నేటితో ముగియనున్న మూడు రోజుల క్రీడా పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వేదికగా 68వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) స్కూల్‌గేమ్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ (అండర్–19), మోడర్న్ పెంటాథ్లాన్ (అండర్–17,19) చాంపియన్‌షిప్–2024 పోటీలు ఆదివారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రంగురంగుల దుస్తులతో హాజరైన బాలబాలికలతో మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. వివిధ జిల్లాల క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌పాస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ క్రీడాజ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభిస్తున్నట్టు చదివి వినిపించారు. బాస్కెట్‌బాల్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, స్థానిక జీడీసీ మెన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, పీఈటీ సంఘ జిల్లా నాయకుడు ఎంవీ రమణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, బాస్కెట్‌బాల్ సంఘ జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి, పీఈటీ సంఘ ఎస్.సూరిబాబు, కె.మాధవరావు, పేడాడ బాబూరావు, నిర్మల్‌కృష్ణ, బి.మాధురి, పీడీలు పాల్గొన్నారు.

షాకిచ్చిన కేంద్ర మంత్రి

కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు క్రీడా నిర్వాహకులకు షాకిచ్చారు. వాస్తవానికి శనివారమే పోటీలు మొదలయ్యాయి. అయితే శనివారం ఉదయం, లేదా సాయంత్రం పోటీలను అధికారికంగా ప్రారంభించాల్సి ఉంది. కానీ ఆదివారం ఉదయం 10 గంటలకు కేంద్ర మంత్రి వస్తానని చెప్పారు.



క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు



హోరాహోరీగా సాగుతున్న గుంటూరు–పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య క్వార్టర్స్‌మ్యాచ్

కానీ ఆ సమయానికి నిర్వాహకులకు షాకిస్తూ హాజరుకాలేనని బదులిచ్చారు.

నేటితో ముగియనున్న పోరు..

రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న అండర్–19 బాస్కెట్‌బాల్ పోటీల్లో క్వార్టర్స్ ఫైనల్స్ నుంచి రక్తి కట్టిస్తున్నాయి. ఆతిథ్య శ్రీకాకుళం జట్లు నిరాశను మిగిల్చాయి. బాలురు జట్లు లీగ్‌లోనే నిష్క్రమించగా, బాలికల జట్టు క్వార్టర్స్‌ఫైనల్స్‌లో బలమైన కృష్ణా జిల్లా చేతిలో ఓటమిపాలైంది. రాత్రి 11 వరకు మ్యాచ్‌లు కొనసాగాయి. పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున యువత హాజరవుతుండటంతో సందడి వాతావరణం నెలకొంది. బాలికల విభాగంలో కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాలు, బాలురు విభాగంలో కృష్ణా, తూర్పుగోదావరి, విశాఖపట్నం, అనంతపురం జిల్లాలు సెమీస్‌కు చేరాయి.

క్లుప్తంగా

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీకి సూరిబాబు



సంపతిరావు సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియమితులయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ వేదికగా ఈ నెల 12 నుంచి జరగనున్న ఇండియా ఛాలెంజింగ్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు సూరిబాబు న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఈయన ఎచ్చెర్ల మండలంని చిలకపాలెం జెడ్పీహెచ్ స్కూల్ పీడీగా పనిచేస్తున్నారు.

ఆగని అధికార పార్టీ వేధింపులు



వాటర్‌ప్లాంట్ వద్ద జేసీబీతో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

పోలాకి: మండలంలోని చెల్లాయివలసలో అధికార పార్టీ వేధింపులపర్వానికి తెరతీసింది. గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన నేతింటి రమేష్‌కు చెందిన వాటర్‌ప్లాంట్‌కు అనుకుని ఉన్న అదనపుగదిని ఆదివారం రెవెన్యూ సిబ్బంది ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన బాధితులు ఇదేం న్యాయం అని ప్రశ్నించగా పైనుంచి ఒత్తిడి ఉందని, అర్థం చేసుకోండంటూ రెవెన్యూ సిబ్బంది బహిరంగంగానే చెప్పడం గమనార్హం. చెల్లాయివలస రెవెన్యూ పరిధిలో మొత్తం ఆక్రమణలు తొలగించకుండా కేవలం రాజకీయ కక్షతో ఇలాంటి చర్యలు చేపట్టడం పట్ల మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఇలాంటి సంస్కృతికి నాంది పలకవద్దని, అధికారులు తాము ఏం చేస్తున్నామో ఒకటికి రెండుసార్లు ఆలోచన చేసుకోవాలని హితవుపలికారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



దీక్షిత్

కాశీబుగ్గ: కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఉదయం దీక్షిత్ అనే మూడేళ్ల బాలుడు ఏడుస్తూ కనిపించగా స్థానికులు కాశీబుగ్గ పోలీసులకు అప్పగించారు. అనంతరం సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో న్యూకాలనీకి చెందిన తండ్రి రమేష్ గుర్తించారు. వెంటనే పోలీసుస్టేషన్‌కు చేరుకోవడంతో కాశీబుగ్గ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వివరాలు సేకరించి అప్పగించారు.



నదిలో నుంచి వస్తున్న ట్రాక్టర్లు

కమీషన్ ఇస్తేనే పర్మిషన్!

- మడపాం ఇసుక ర్యాంపు వద్ద అనధికార వసూళ్లు
- ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున కలెక్షన్
- రోజుకు వందకు పైగా ట్రాక్టర్లలో ఇసుక తరలింపు



నరసన్నపేట:

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక మాటున కూటమి నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. నరసన్నపేట మండలం మడపాం వద్ద ట్రాక్టర్‌కు రూ.200 వరకూ వసూలు చేస్తున్నారు. ఇదే పంచాయతీ బుచ్చిపేట వద్ద పగలంతా ఇసుకను డంపింగ్ చేసి రాత్రి సమయాల్లో లారీల్లో లోడింగ్ చేసి అక్రమంగా విశాఖకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నారు. గడిచిన నాలుగు రోజులుగా యథేచ్ఛగా ఈ వసూళ్లు, అక్రమ తరలింపు జరుగుతోంది. ప్రజలు తమ అవసరాలకు నిమిత్తం ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ప్రకటించగా.. దానిని అలుసుగా తీసుకొని కొందరు కూటమి నాయకులు ఈ దందాకు పాల్పడుతున్నారు. గతంలో మడపాం ర్యాంపునకు వెళ్లేందుకు గ్రామంలోనించి మార్గం ఉండగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఈ దారిని మూసి వేశారు. పది రోజులుగా మడపాంలో ఇసుక తవ్వకాలు ఆగిపోయాయి. తాజాగా ర్యాంపునకు వెళ్లేందుకు మరో మార్గం చూపి ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. రోజుకు వంద నుంచి 150 వరకూ ట్రాక్టర్లు ర్యాంపునకు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోజుకు సరాసరిన రూ.రెండు లక్షల వరకూ వసూలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ వసూళ్లతో ఇసుక ధరలు రూ.300 వరకూ పెరిగాయి. కాగా ఈ అక్రమ వసూలుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి నాయకులు సహకారంతో జరుగుతున్న ఈ అక్రమ వసూళ్లను నిలిపి వేయాలని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బుచ్చిపేటలో అక్రమ తరలింపు..

ఇదే పంచాయతీ పరిధిలోని బుచ్చిపేటలో ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. ఉచిత ఇసుకను పగలంతా డంపింగ్ చేసి రాత్రి సమయాల్లో లారీల్లో విశాఖకు తరలిస్తున్నారు. గడిచిన నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున ఈ అక్రమ తరలింపు జరుగుతోంది. ఈ వ్యవహారంపై అధికారులు నిఘా వేస్తే అక్రమ తరలింపు గుట్టురట్టు అవుతుందని స్థానికులు అంటున్నారు.



మడపాం ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ డ్రైవర్ల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్న దృశ్యం

● అ'పూర్వ' సమ్మేళనం



అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై వర్క్‌షాపు నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఏపీ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో ఎస్టీ, ఎస్సీ చట్టాలపై వర్క్‌షాపు(అవగాహన సదస్సు) నిర్వహించనున్నట్లు విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం సీఐడీ విభాగం అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు చట్టాలు, విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు అబుల్ కలాం ఆజాద్ విగ్రహావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని శాంతినగర్‌లో గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనంలో సోమవారం ఉదయం 9.15 గంటలకు తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహావిష్కరణ జరుగుతుందని మందిర కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మహిబుల్లాఖాన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జేసీ ఫర్మాన్ అహ్మద్ రానున్నారని పేర్కొన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఇచ్ఛాపురం: ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల్లో చోరీకి గురైన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ప్రధాన నిందితుడైన ఒడిశా చెందిన కిరణ్‌కుమార్ జనా అలియాస్ లిట్టును ఆదివారం ఈదుపురం, బెల్లుపడ కూడలిలో జాతీయ రహదారిపై పట్టుకున్నామని చెప్పారు. అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, కంచిలికి చెందిన ఢిల్లీరావు వద్ద ఉంచిన మరో ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇందులో ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ అయినవి రెండు, బరంపురం పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్ అయినవి మూడు వాహనాలు ఉన్నాయని తెలిపారు. నిందితులను రిమాండ్‌కి తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నంనాయుడు, బషీర్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్:

104 ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణ కష్టంగా మారుతోందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తే ప్రజా ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈవోలకు జీవో–7 ప్రకారం వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి యాజమాన్యాలు చేస్తున్న అక్రమ వసూళ్లను తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేష్‌బాబు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేస్తున్న 104 కార్మికులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నలుగురు ఎంపిక

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట జ్యోతీరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్లో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ పోటీల ఎంపికలు నిర్వహించారు. 30 మంది క్రీడాకారులు పాల్గొనగా నాలుగు రౌండ్ల పాటు పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన బగాది కార్తికేయ, వి.రాహుల్, వినమ్ర, రిత్విక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆలిండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యుడు సనపల బీమారావు తెలిపారు. వీరంతా ఈ నెల 19 నుంచి 21 వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బగాది కిషోర్, కార్యదర్శి రమేష్ కోచ్‌లు అభినవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో చెస్ కమిటీ ప్రతినిధులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని మకరాంపురం కూడలిలో ఆదివారం సంత వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని భీమ్ గుమన్‌సింగ్(60) అనే పాన్‌షాప్ వ్యాపారి మృతిచెందాడు. శనివారం రాత్రి 11 గంటలకు రైలులో సోంపేట స్టేషన్‌కు వచ్చి ఆదివారం వేకువజామున సంతవద్దకు వచ్చాడు. కొబ్బరికాయలు కొనుగోలు చేసి రోడ్డుకు అవతలవైపు అరటిపళ్లు కొనేందుకు రోడ్డు దాటుతుండగా.. పలాస నుంచి ఇచ్ఛాపురం వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లా బిరిబిడి గ్రామం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వై.రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేశారు.

హంస నావికోత్సవానికి ఏర్పాట్లు



సిద్ధమైన హంస వాహనం

- 13న సాయంత్రం 4 నుంచి వేడుకలు ప్రారంభం
- భారీగా భక్తులు దర్శించుకునే అవకాశం

అరసవల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 13న ఆదిత్యుని ఉత్సవమూర్తుల హంసనావికోత్సవం (తెప్పోత్సవం) పవిత్ర ఇంద్రపుష్కరిణిలో జరగనుంది. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి హంసనావికోత్సవం ప్రారంభించనున్నారు. ప్రధానార్చకులు ఆధ్వర్యంలో గంగ పూజ, హారతితో కార్యక్రమం ప్రారంభించి అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులు 12 సార్లు పుష్కరిణిలో విహరించనున్నారు. అనంతరం ఆలయంలోకి వేదమంత్రోచ్ఛారణల నడుమ తిరువీధిగా తీసుకువచ్చేలా చర్యలు చేపడుడుతున్నారు.

ఇంద్రపుష్కరిణి సిద్ధం..

ఇంద్ర పుష్కరిణితో పాటు ఆలయ పరిసరాలు, వసతి గదులు, విమాన గోపురం, రాజగోపురం తదితర ప్రాకారాల్లో విద్యుత్ అలంకరణల పనులు పూర్తికావచ్చాయి.

పుష్కరిణి చుట్టూ భక్తులు భారీగా తరలివచ్చి..కార్తీక దీపాలను వెలిగించేలా అవకాశాలున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆదిత్యుని ఉత్సవమూర్తులు పుష్కరిణిలో విహరించేలా కట్టుదిట్టంగా హంసవాహనాన్ని సిద్ధం చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రమే పుష్కరిణిలోకి దించి పరిశీలన చేపట్టారు.

చర్యలు చేపడుతున్నాం..



13న తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ సూచనల మేరకు పుష్కరిణిలో 12 సార్లు స్వామి వారు విహరించేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నాం. బోటుపై అధికారిక సిబ్బంది, అర్చకులు మినహా మిగిలిన వారికి అనుమతి నిరాకరణ చేస్తున్నాం.

– వై.భద్రాజీ, ఆలయ ఈవో

దేవాలయాలను పరిరక్షిద్దాం

కొత్తూరు: హిందూ దేవాలయాలను పరిరక్షించుకుందామని పార్వతీపురం మన్యం జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు చింతా భాస్కరనాయుడు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం కొత్తూరులో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల నిర్వహణ, ఆస్తుల విషయాల్లో ప్రభుత్వాలు తలదూర్చకూడదన్నారు. దేవాలయాల నుంచి వస్తున్న ఆదాయాన్ని కేవలం ధర్మప్రచారానికే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు పొగిరి రవి, ఖండ కార్యవర్గ కార్యదర్శి మండంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, చోడవరపు రామాంజనేయులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు గార రమణమ్మ, నరసింహమూర్తి, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

ఉత్సాహంగా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను అధ్యక్షతన జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 38వ జిల్లా స్థాయి సబ్–జూనియర్ కుర్గీ, 13వ జిల్లా స్థాయి పూమ్‌సే చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ సుధీర్ వర్మ, బహుజన నేత డాక్టర్ కంఠ వేణు, రెడ్డి శంకర్, న్యూట్రీషన్ కోచ్ నాగరాజు, సహారా కృష్ణ, సంపతిరావు గోవిందరాజులు, తైక్వాండో కోచ్‌లు గౌతమ్, నవీన్, జోగుపాటి వంశీ, వైశ్యరాజు జాస్మిన్, మదన్, బాలాజీ, గణసాయి, రాహుల్, జనార్ధన్, హరి, నాగమ్మ పాల్గొన్నారు.



తైక్వాండో విజేతలతో నిర్వాహకులు, అతిథులు

మైదానాలపై ప్రత్యేక దృష్టి

- జిల్లాలో క్రికెట్ విస్తరణ దిశగా జిల్లా క్రికెట్ సంఘం అడుగులు
- శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం (సగభాగం) కోసం ఎంఓయూ పూర్తి



డిగ్రీ కళాశాల మైదానంలో తూర్పు భాగం, (ఇన్‌సెట్లో) వివరాలు వెల్లడిస్తున్న పీవైఎస్ శాస్త్రి, మదీనా శైలానీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెట్ సంఘం(జెడీసీఎస్) తన కార్యకలాపాలను మరింతగా విస్తరించే పనిలో పడింది. జిల్లా జట్ల ఎంపికల్లో డొల్లతనంపై వస్తున్న విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా.. ముందున్న లక్ష్యసాధన కోసం వడివడిగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు మైదానాలను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మైదానాల విస్తరణ, క్రికెట్ కార్యకలాపాలను విస్తరించే ప్రయత్నంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సగభాగాన్ని (మైదానానికి తూర్పు భాగం–ఎన్‌సీసీ కార్యాలయం వైపు) పూర్తిగా క్రికెట్ సంఘం వినియోగించుకునేందుకు ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ మేరకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒప్పంద పత్రాన్ని తాజాగా అందజేసినట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, కోశాధికారి మదీనీ శైలానీ తెలిపారు. త్వరలో శ్రీకాకుళంలో అంతర్‌పాఠశాలల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తామని, షెడ్యూల్‌ను ప్రకటిస్తామన్నారు.

మిగిలిన మైదానాలు సైతం..

కళింగపట్నం బీచ్ వైపు వెళ్లే మార్గంలోని క్రికెట్ మైదానం, పాత్రునివలసలో క్రికెట్ మైదానానికి కేటాయించిన స్థలాన్ని కూడా ఏసీఏ సహకారంతో అభివృద్ధిచేసేలా ప్రణాళిక చేస్తున్నారు. ఈ మూడు మైదానాలు పూర్తయితే ఏసీఏ అంతర్ జిల్లాల, అంతర్‌జోనల్ క్రికెట్ పోటీలకు, ఇతర టోర్నీలకు శ్రీకాకుళమే ఆతిథ్యం అందించనుంది. ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తికావడానికి సహకరిస్తున్న కేంద్రమంత్రి, జిల్లా మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్‌కు, జిల్లా క్రికెట్ సంఘ ముఖ్య ప్రతినిధులతోపాటు మెంటార్ ఇలియాస్ మహ్మద్, డాక్టర్ సువ్వారి రవికుమార్, ఆర్వీ రెడ్డి, లాల్‌బహదూర్, బెనర్జీ, సీనియర్ క్రికెటర్లు, వెటరన్ ప్లేయర్లు కృతజ్ఞతలు చెబుతున్నారు.